# రసలాలిత

శుక్రవారం

ఉదయం ఏడు గంటలు కాలేదింకా?

క్రొత్త పెళ్ళి కొడుకు కళ ఇంకా తగ్గని శ్రీధర్ గదిలో నిద్ర పోతున్నాడు

పెళ్ళయి ఏడాది తిరగలేదు. అత్తగారింట్లో తొలి ఉగాది గడిపేందుకు వచ్చారు. అలసి సొలసిన రేరాజులా ప్రశాంతంగా నిద్రపోతున్న అతని ముఖంలో ఆనంద చంద్రికలు వెల్లి విరుస్తున్నాయి.

గదిలో అడుగుపెట్టిన దేవి భర్తవైపు ఓ సారిచూచి ముసిముసిగా నవ్వింది. అతన్ని చూసి నపుడల్లా ఆమెకి పసిదనం వీడని పిల్లాడే గుర్తుకొస్తాడు.

పగలుచూస్తే రేయిచేసిన వింతలు, రాత్రి చూస్తే పగలంతా చేసే చిలిపి చిలిపి పనులు తలపులో మెదల్తాయి.

'శ్రీ......శ్రీ.....'

లయబద్ధంగా మ్రోగే ఫారెన్ బజర్‌లా పిలిందామె భర్తని అలా పిలుచుకోవటం ఆమెకి అపురూపంగా ఉంటుంది. శ్రీ వారిని శ్రీధర్‌ని అలా సంక్షిప్తీకరిస్తుందామె కోడికూత అతని నిద్రని అల్లరి పెట్టలేదు.

కానీ ప్రియసఖి పిలుపులు అతనికి మేలుకొలుపు...... ఆమె కొలుపు అతనికి రతి కొలుపు.....

రేకులు విచ్చే ముద్దమందారంలా కనులు విప్పేడతను.

ఎదురుగా..........

ముద్ద మందారంలా తూరుపు సిందూరంలా దేవి.

కొలువు తీర్చిన లక్ష్మిలా.....నారాయణుని చేరబోయే పాలకడలి కూతుర్లా.

"దేవీ!" అతని గొంతు వీణలా మ్రోగింది.

"నిన్ను ఎప్పుడు చూసినా అది పగలో రేయో తెలియదు."

సిగ్గు పడిందామె.

"నీ సిగ్గే సింగారం .......నిగ్గు తేలిన బంగారం.......

"ఈ రోజు ఉగాది"

"ఉగాదో- దసరానో - నిన్ను చూస్తే నాకు రసాది....ఎప్పుడూ అరవిచ్చిన మల్లె మొగ్గలా .....ఎవర్ గ్రీన్ హీరోయిన్ లా ఎంత తాజాగా, ట్రిమ్ గా వుంటావో నవనవోన్మేషమైన అందంతో భూలోకానికి షికారొచ్చే శ్రీరములాగా నా కళ్ళకెప్పుడూ నవ వధువులా కన్పిస్తావు.

"మొఖం కడుక్కోకుండానే అబద్ధాలు అతి శయోక్తులు చెబ్తే ఆడపిల్లలు పుడ్తారట తెల్సా?"

"అలాగేం అయితే నాకు నీలాంటి అమ్మాయే కావాలి."

అబ్బో! ఎంతాశ! నాకు అబ్బాయే కావాలి.....

"పోన్లే ఇద్దర్నీ ప్రెజెంట్ చేస్తాం! అర్జంటుగా నీ మార్నింగ్ ముద్దు ఇచ్చెయ్!"

ఇంత సేపూ ఆమె అతని మంచానికి అల్లంత దూరంలోనే ఉంది.

"రా! అని కనుసైగ చేశాడు శ్రీధర్.

ఊహూ అన్నట్టుగా తల అడ్డంగా ఆడించింది.

'మార్నింగ్ కిస్సోయ్.......మామూలేగా ఈ పది నెలలా పదిహేను రోజుల్నుంచీ వ్రతభంగం కాకుండా ముప్పూటలా నిష్ఠా గరిష్ఠుడైన వేదవేత్త, సంధ్యా వందనంలా తమరీ భక్తుడికి ప్రేమతో ప్రసాదించే ప్రేమ తాళం.."

"ప్రేమ తాళమా"?

"అవునమ్మాయ్..... ఈ పెదాలపై ముద్దుల ముద్ర వేసేగా భర్తని మేల్కొలిపి.... ఆఫీసుకి పంపి..రాత్రి జోకొట్టేది. మరొకర్ని మనసావాచా కర్మణా తలుచుకోటానికి కూడా అవకాశం లేకుండా! తమరు వేసే మన్మధ తాళం'

పకపక నవ్వింది దేవి.

"అరే! ఆకాశం నుండి తారక లెంత అందంగా యిలవంకకి వస్తున్నాయ్?"

"ఒట్టి పొగడ్తలు"

"గట్టి పొగడ్తలు కావాలంటే ఇలా రావాలి. ఈ కోటలోకి..."

"అమ్మో! ఇంకేమయినా ఉందా? నేను నీళ్ళు పోసుకున్నా..నువ్వేమో ఇంకా స్నానమే చేయలేదు. అమ్మ చూస్తే ....అమ్మమ్మ గమనిస్తే."

"హాయ్! దేవీ! నువ్వు నీళ్ళోసుకున్నావా! ఎప్పుడేమిటి?"

"మాటల్తో బురిడి కొట్టించడం దొరగారి కలవాటే -అదేం లేదు కానీ - ముందు లేచిరండి. బ్రష్షుపై పేస్టు, కప్పులో కాఫీ మీ కోసం ఎదురు చూస్తున్నాయి."

"దేవీ అనుగ్రహం కోసం ఈ దీనుడూ ఎదురు చూస్తున్నాడు అవి నిర్జీవాలు, అవి వుస్సురనవు- కానీ పతిదేవుడు ప్రాణాధారమైన ముద్దు దక్కకపోతే ఉసురుసురు మంటాడు."

"ఈ రోజు శుక్రవారం, ఉగాది. సంవత్సరారంభం. వేకువనే లేచి తలంటుపోసుకుని పూజ చేసుకుని ప్రసాదం స్వీకరించాలి.అందాక అయ్యగారి ఆటకట్టే-"

నాకు ప్రతి రోజూ శుక్రవారమే. నిత్య దేవీ దర్శంతో నేనెప్పుడూ తరిస్తూనే వుంటా నాకు నీదయే ప్రసాదం నీకరుణే కటాక్షం"

"ఒట్టి భార్యా విధేయుడిలా మాట్లాడకండి।

"దేవీ ఈ లోకం అంతా భార్యా దాసురే బయటే లేని దర్పం-"

"రిసెర్చి చేసి కనుక్కున్నందుకు అభినందనలు"

"థాంక్యూ! కానీ థాంక్స్ ఒట్టి మాటల్లో కాదు. గురజాడ మహాకవి ఏమన్నాడు. ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్ట మన్నాడు....."

'శ్రీ శ్రీ కూడా కదిలేదీ కదిలించేదీ పెను నిద్దుర వదిలించేదీ కావాలన్నాడు."

'నేను నిద్దర్లేచాగా- జస్ట్ భార్యామణితో దాంపత్యోపనిషత్తు రహస్యాలు చర్చిస్తున్నా.'

'ఇంతకీ మీరు లేచి రారా'

'మతి పోయే అందంతో శ్రీమతి పిలిస్తే లేచి వెళ్ళని వాడు నిజంగా......

'అబ్బబ్బ!'

'అప్పుడే అంత చిరాకా మాటలకే తూలిపోతే ఇంతకీ యీ రోజు దేవిగారెంత అందంగా వున్నారో తెలుసా తాజమహలు చూసినప్పుడైనా కలగని తన్మయత్వం యిలా కురులు విడిన అందంతో నడయాడే సోయగంలా వున్న నిన్ను చూస్తే పరవశం కలుగుతోంది.'

'గొప్ప! తలంటుకుని తలారా షాంపూతో స్నానం చేసి ఫ్యాన్ గాలికి కురులు ఆరబెట్టు కుంటే అందం త్రిగుణీకృతమవుతుంది.'

'అయితే యిక నుంచీ నువ్వు రోజూ తలారా స్నానం చేయ్'

'ఆశ వారానికోసారి తలంటుకోటానికే నాకు గంటకుపైగా పడ్తుంది.'

'నువ్వు నడుస్తోన్న చమరీ మృగంలా వున్నావు?'

'మొత్తానికి మృగాల్లో చేర్చారన్న మాట-'

'పడక వీడి- గదిని దాటి పదడుగులు వేస్తే యీ రోజు మీకూ తలంటు వుంది' కెప్పుమన్నాడు శ్రీధర్.

'అదేం? నివ్వెరపోయి అడిగింది.

'మా అమ్మ తలకు పోస్తానంటే ఈ పాతికేళ్ళలో ఏనాడూ ఒప్పుకోలేదు మూతి మూడు వంకర్లు త్రిప్పిందామె.

'శ్రీవారూ శ్రీమతి జలకాలాడించటానికి యితర్లు తలకుపోయటానికి హస్తి మశకాంతం భార్యతో స్నానాల గది సరసాల రసాల శాల. అయ్యగారికి ఆ అనుభవం లేదుగా.'

ఆమె మాటలు అతన్లో నూతనోత్సాహాన్ని రేకెత్తించాయ్.

మరో అరగంట తర్వాత!

స్నానశాల ప్రయోగశాల రసాల పరిమళాల హేలా వినూత్నమాల అయింది తలకి

షాంపూ రుద్దేవేళ అతని చేతులు అల్లరి చేశాయి. కళ్ళు మూసి కదలాడి శివతాండవం చేశాడు. టబల్లో అతన్ని కూర్చోబెట్టి తలతుడుస్తూ వుంటే అతను పిలిచి పిన్నారి శిశువై పోయాడు.

పొడిపొడిగా వున్న పిక్కు వెంట్రుకలు ఆమె చేతిలోని దువ్వెనకి దాసోహమని అందమంతా పోగేసుకున్న క్రాపుగా అయిపోయాయి.

ముఖాన తిలకం బొట్టుగా పెట్టింది.

"బుగ్గన కాటుక ఒకటే తక్కువ"

"అది కొత్త పెళ్లికొడుకులం శోభోయ్"

"నేను నిత్య పెళ్ళి కొడుకుని, శృంగార చక్రవర్తిని."

అతని మాటలకి మల్లెమొగ్గలు ఒగ్గు చూపేలా నవ్వింది.

అద్దం - నిలువుటద్దం...

భార్య భుజాల చుట్టూ చేతులు వేసి అద్దంలోకి చూసుకొన్న శ్రీధర్ కెవ్వుమన్నాడు మళ్ళీ.

"ఇపుడేం వెర్రి పుట్టుకొచ్చింది-"

"మేడ్ ఫర్ యీచ్ అదర్‌లా వున్న మనల్ని కాదన్న అద్దంలో వున్న ఆ స్వీట్ రాస్కెల్ ఎవరోయ్?"

"ఆ అందాల చందమామ-కనువిందైన మన్మధమూర్తి తమరే - ఏనాడైనా తలస్నానం చేశారా తమరు?"

"నాకు తల తడుపుకోవటం తెలుసు - తలపుల మలుపుల్లో తీయతీయని వలపులు నింపుకునేలా తలారా స్నానించటం ఈరోజే తెల్సింది. దేవీ ధన్యుడ్ని"

"అనుగ్రహింపబడ్డాను-" అందామె.

"నిజంగా ఎంత అందగా వున్నానో. నాకు నేను ముద్దొస్తున్నా-" ముసి ముసి నవ్వులు నవ్వింది దేవి....

మరో అయిదు నిమిషాల తర్వాత.

"చేయి పట్టండి."

"ఎందుకు? చేతిలో అమృతం పోస్తావా? మోహినిలా వున్నావ్?"

"ఊఁ" గద్దించింది.

అతను అరచేయి విప్పాడు.

ఆమె ఉద్ధరిణితో వెండి గిన్నెలోని ప్రసాదం వేసింది.

రుచి చూశాడు.

కెవ్వుమన్నాడు. జిహ్వ తెగిపోయినట్టు అరిచాడు.

"అంతా పసిబాలుని తంతు! అది ఉగాది పచ్చడి. కొత్త మామిడికాయ ముక్కలు

వేపపువ్వు - కొత్త చింత పండు - లేత కొబ్బరి ముక్కలు, కొబ్బరి నీళ్ళు, బ్రతుకులో తీపి చేదు పులుపు వగరు రుచి తెలిసేందుకు కొత్త సంవత్సరారంభంలో చేసే రుచి...."

పంటి క్రింద కొబ్బరి ముక్క..... నాలుకపై బెల్లం ముక్క - గొంతులో కొబ్బరి నీళ్ళు రుచి తెలిసింది శ్రీధర్‌కి.

"అద్భుతం!" అన్నాడు అతను.

"ఈరోజు ఉగాది ప్రియతమా! ఇల్లలికి ముగ్గులు పెట్టి వాకిళ్ళకి తోరణాలు కట్టి తలంటుకుని తలపోసుకుని కొత్తబట్టలు కట్టుకుని ఉగాది పచ్చడి పుచ్చుకొని భక్ష్యభోజ్య పరమాన్నాలతో గడ్డ పెరుగుతో అరిటాకులో కమ్మగా భోజనం చేయటం మన తెలుగుదనం.

ఇది తెలుగుదేశం - మనం తెలుగు వాళ్ళం. మన తెలుగుజాతి జన జీవనం ఇది. ఇదీ తెలుగుదనం.

హొటల్లో కాఫీ తాగి, కుళాయి క్రింద తలకడుక్కుని, ఇస్త్రీ బట్టలు కట్టుకుని ముక్కునా నోట వేసుకున్నట్టు హడావుడిగా యాంత్రికంగా బ్రతకటం కాదు. మన సంప్రదాయం వేరు - మన బ్రతుకు తీరే వేరు - మన పండుగలు పర్వాలు మన జాతి జీవగర్రలు....."

దేవి మాట్లాడ్తూ వుండే కళ్ళప్పగించి వింటున్నాడు శ్రీధర్.

అతనికామె కన్యాకుమారిలో అమ్మవారిలా - మధుర మీనాక్షిలా - కంచి కామాక్షిలా - ఊహూ తెలుగు తల్లి కనకదుర్గలా - అన్నపూర్ణలా కన్పించింది.

"దేవీ!"

నీవన్నది నిజం .... మన తెలుగుదనం మగవాళ్ళలో లేదు. ముత్తైదువలో వుంది. కట్టులో, బొట్టులో, మాటలో మన్ననలో, నీతిలో రీతిలో, బ్రతుకులో పాటలో, నడకలో నడతలో ప్రత్యేకమైన విశిష్టమైన తనదైన తెనుగుపునుగుతావులు వెదజల్లే స్త్రీత్వం స్త్రీ తత్వం వుంది.

మగవాడు నిమిత్తమాత్రుడు.

సంప్రదాయాన్ని రక్షించి, జాతి ఉచితజ్ఞతను కాచి, తెలుగు తీరుతెన్నులు ప్రోచి, బ్రతుకుల్లో నిత్య మధు మాస యామినులు విరియించి, తన యింటిదనాన్ని, వంటయింటి వనితనాన్ని ఎల్లవేళలా కాపాడ్తూ తెలుగు వెలుగుకీ శ్రీరామ రక్షగా నిలిచేది తెలుగింటి పడుచు....

శ్రీధర్ మాటలకి మురిసిన దేవి అతనికి ఇంటెన్సివ్ ఇంక్రిమెంట్ ఇచ్చింది.

ఉగాది పచ్చడి చేదుని తీయ తీయగా మార్చిన అధరామృతాపోశనం పట్టిన శ్రీధర్ ఆ క్షణంలో తెలుగు వీరుడే అయ్యాడు....

● పల్లకి సచిత్ర వార పత్రిక సెప్టెంబరు 18, 1986 ●